కదం తొక్కిన దగాపడ్డ జనం

- జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో..
- రావులపాలెంలో వెన్నుపోటు దినం నిరసనకు భారీగా హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు
- కూటమి ప్రభుత్వ మోసాలపై హోరెత్తిన నిరసన
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



రావులపాలెం జాతీయ రహదారిపై ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి


రావులపాలెంలో రావణాసురుడి ఆకృతి చంద్రబాబు, సూపర్‌సిక్స్ హామీల తలతో తయారు చేసిన చిత్రాన్ని చూపిస్తూ మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయడంపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వెన్నుపోటు దినం' పేరిట నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఆ పిలుపు మేరకు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో దగాపడ్డ జనం కదం తొక్కారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 57 గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు నియోజకవర్గ ప్రధాన కూడలి రావులపాలెంలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చారు. భారీ ర్యాలీలో జగన్, జగ్గిరెడ్డి నాయకత్వాలకు ఉత్సాహంగా జయ జయ నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ నిరసనతో రావులపాలెం హోరెత్తింది.

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, అన్ని పార్టీలు కూటమిలో చేరి ప్రజలను దగా చేశారని, అలా దగాపడ్డ జనం పక్షాన ఒకే ఒక్క నాయకుడు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలబడ్డాడని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావణాసురుని ఆకృతిలో తయారుచేసిన చంద్రబాబు చిత్రపటానికి పది తలలుగా సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలు ఉంచి తయారుచేసిన చిత్రపటాన్ని ప్రదర్శిస్తూ మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడారు. చంద్రబాబు ప్రజలను ఏ విధంగా వెన్నుపోటు పొడిచారో వివరిస్తూ మాట్లాడారు. తల్లికి వందనం నిల్, కానీ తండ్రికి మాత్రం ఇంధనం ఫుల్ తరహాలో చంద్రబాబు మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు తుస్సుమనిపించారని ఎద్దేవా చేశారు. 50 ఏళ్ల నిండిన బీసీ సోదరులకు ఇస్తామన్న పింఛన్ ఎక్కడ అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఏది అని, ప్రశ్నిస్తా అన్న పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారో తెలియడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులను నట్టేట ముంచారన్నారు. అలాగే నిత్యావసరదారులు, కరెంటు ధరలు భారీగా పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. రాజధాని అమరావతి పేరుతో భ్రమరావతి నిర్మించారని దీనికి రూ.5,200 కోట్లు కమిషన్ నొక్కారని ఆరోపించారు. అలాగే 99 పైసలకే ఉర్సాకు వైజాగ్ భూములు కట్టబెట్టి భూకుంభకోణం చేశారని, ఇలా ఏడాది కాలంలో ప్రజలను అన్ని రకాలుగా వెన్నుపోటు పొడిచి చంద్రబాబు తన నైజాన్ని మరోసారి చూపించారన్నారు. తుని రైల్వే ఘటనను మళ్లీ తిరగదోడతామని కాపు సామాజిక వర్గంపై అక్కసును చంద్రబాబు చూపించారన్నారు. అలాగే కొత్తపేటలో నాయకుల అవినీతి పరాకాష్టకు చేరిందన్నారు. చికెన్ షాప్‌కు విద్యుత్ మీటరు ఇచ్చేందుకు రూ.1.50 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. అలాగే కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులను ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోనని కార్యకర్తలకు అండగా ఉంటూ ఏ పోరాటానికైనా సిద్ధం అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళావెంకట్రావు సెంటర్ నుంచి జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ జెండాలు, ప్లకార్డులు, ఫ్లెక్సీ చేత పట్టుకుని కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక వ్యతిరేక విధానాలను నినాదాల రూపంలో వివరిస్తూ ర్యాలీ సాగింది. స్థానిక సెంటర్ నుంచి బలరామిరెడ్డి జంక్షన్ మీదుగా యూటర్న్ తీసుకుని తిరిగి కళా వెంకట్రావు సెంటర్ చేరుకుని, అక్కడి నుంచి రింగ్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ ముక్తేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీలు మార్గన గంగాధరరావు, తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు గూడపాటి రామాదేవి, కుడిపూడి శ్రీనివాసరావు, తోరాటి సీతామహాలక్ష్మి, బోనం సాయిబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల వీరభద్రరావు, దొమ్మేటి అర్జునరావు, కనుమూరి శ్రీనివాసరాజు, తమ్మన శ్రీను, కొత్తపేట మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, సాదు చెంచయ్య, నాతి కుమార్‌రాజు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్‌లు ముసునూరి వెంకటేశ్వరరావు, నెక్కంటి బుజ్జి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, మాజీ ఏజీపీ నామాల శ్రీను, మాజీ సర్పంచ్ ద్వారంపూడి దొరబాబు, మండల యువజన విభాగం అధ్యక్షుడు నాంద్ర నాగమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సాకా ప్రసన్నకుమార్, బొక్కా వెంకటలక్ష్మి, సర్పంచులు దొమ్మేటి అర్జునరావు, తమ్మన శ్రీను, అంబటి సుబ్బలక్ష్మి, సబ్బితి మోహనరావు, రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పితాని రాంబాబు, పమ్మి చంటి, పులగుర్త రామారావు, రాంపండు, జవ్వాది రవిబాబు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సభ్యులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇది ఫెయిల్యూర్ ప్రభుత్వం

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మలికిపురంలో వెన్నుపోటు దినం ర్యాలీ

మలికిపురం: కూటమి ప్రభుత్వం ముమ్మాటికీ ఫెయిల్యూర్ ప్రభుత్వం అని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో బుధవారం మలికిపురంలో జరిగిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక కూడలిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కూటమి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ జరిగింది. అనంతరం పార్టీ శ్రేణులతో కలసి మలికిపురం తహసీల్దార్ టి.ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సూర్యారావు మాట్లాడుతూ గత ఏడాదిలో అధ్వాన పాలన సాగించిన ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు ఏనాడు చూసి ఉండరని అన్నారు. ఏడాదిలోనే ఇన్ని కోట్ల అప్పులు చేసి ఎటువంటి సంక్షేమం చేపట్టని సర్కారుగా కూటమి ప్రభుత్వం రికార్డు సాధించిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బళ్ళ ప్రసన్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, కుసుమ చంద్రశేఖర్, బొలిశెట్టి భగవాన్, కేఎస్ఎన్ రాజు, మంగెన సింహాద్రి, పాటి శివకుమార్, కటకంశెట్టి ఆదిత్య, సూరిశెట్టి బాబీ, కంచర్ల శేఖర్, ఈద రవిరెడ్డి, దొంగ సత్యనారాయణ, కె.ఎస్తేరు రాణి, తెన్నేటి కిషోర్, తోటే జాన్‌బాబు, గుర్రం జాషువా, తాడి సహదేవ్, నల్లి రత్నకుమార్, మద్దుల కాసుబాబు, నేతల నాని, కొల్లాబత్తుల సతీష్, స్టూడియో వర్మ, ఉచ్చుల విష్ణుమూర్తి, దార్ల పెద్దబాబు అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



మలికిపురంలో తహసీల్దార్ ఈశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పార్టీ శ్రేణులు

ప్రజలకు చంద్రబాబు ప్రభుత్వం వెన్నుపోటు: జెడ్పీ వైస్ చైర్మన్ విప్పర్తి, కోఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని జెడ్పీ వైస్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలకు నిరసనగా పి.గన్నవరంలో పార్టీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం 'వెన్నుపోటు దినం' ఆందోళన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి వందలాది మంది కార్యకర్తలు తరలిరావడంతో స్థానిక సెంటర్ కిక్కిరిసిపోయింది. తొలుత స్థానిక అక్విడెక్ట్ వద్ద రాజశేఖరరెడ్డి, మూడు రోడ్ల సెంటర్లో అంబేడ్కర్ విగ్రహాలకు వారు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా తరలివెళ్లి డిప్యూటీ తహసీల్దార్ ఎం.సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. విప్పర్తి, గన్నవరపు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. కనీసం రైతుల వద్ద కొన్న ధాన్యానికి కూడా డబ్బులు ఇవ్వకుండా అన్నదాతలను ఇబ్బందులు పెడుతున్నారని గన్నవరపు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నాటి హామీలు అమలు చేసే వరకూ కూటమి ప్రభుత్వంపై పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ నేతలు నేలపూడి స్టాలిన్‌బాబు, మందపాటి కిరణ్‌కుమార్, జెడ్పీటీసీలు కొరెడ్డి అంజిబాబు, బూడిద వరలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నదని, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నదని విమర్శించారు. ఆందోళన కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కుడుపూడి విద్యాసాగర్, విత్తనాల ఇంద్రశేఖర్, నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున రాష్ట్ర, జిల్లా, మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


రావులపాలెం తహసీల్దార్ ముక్తేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు


పి.గన్నవరంలో డీటీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ విప్పర్తి, కోఆర్డినేటర్ గన్నవరపు

క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ వీరా మల్లికార్జునరావు అధ్యక్షతన పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ కె.సూర్యనారాయణ బుధవారం తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపైన, తాగునీటి సరఫరా తదితర అంశాలపైన చర్చించనున్నట్టు ఆయన వెల్లడించారు.

భోజన పథకం నిర్వాహకులకు వంటల పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్

మామిడికుదురు: అంబాజీపేట జెడ్పీహెచ్ స్కూల్లో మండలంలోని 64 పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. అనంతరం వారు తయారు చేసే వంటలపై పోటీ ఏర్పాటు చేశారు. ఎంఈఓ మోకా ప్రకాష్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సురేష్ మాట్లాడుతూ రుచికరమైన ఆహారం తయారు చేసి విద్యార్థులకు పెట్టాలన్నారు. చేతులకు గ్లౌజులు వేసుకుని పిల్లలకు ఆహారం వడ్డించాలన్నారు. కట్టెలు లేదా వంట గ్యాస్ వినియోగించి ఆహారం తయారు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఫణి కుమార్, టీచర్స్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత


రామేశ్వరంలో పేద కుటుంబానికి సాయం అందజేస్తున్న సరెళ్ల

సఖినేటిపల్లి: రామేశ్వరంలోని ఓ పేద కుటుంబానికి స్థానిక శ్రీరామ యువజన సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థలు బుధవారం చేయూతనిచ్చాయి. చిన్న వయస్సులోనే గుండెపోటుతో మృతి చెందిన గ్రామానికి చెందిన మత్తి రవికుమార్ కుటుంబానికి బాసటగా పై రెండు సంస్థలు అండగా నిలిచాయి. మేటకొండప శ్రీరామ యువజన సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ కలిపి సమకూర్చిన మొత్తం రూ.11 వేలను, మాజీ సర్పంచ్ సరెళ్ల విజయ్ ప్రసాద్ సదరు కుటుంబానికి అందజేశారు.

రథయాత్రకు ఘన స్వాగతం


సత్యసాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్ర బుధవారం మామిడికుదురు చేరుకుంది. ఈ రథయాత్రకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. సత్యసాయి బాబా కీర్తనలు ఆలపిస్తూ జాతీయ రహదారి నుంచి శివాలయం వరకు రథాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ మహిళలు హారతులు పట్టారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రథంలో కొలువైన భగవాన్ సత్యసాయిబాబాను దర్శించుకున్నారు. స్వామి యొక్క దివ్య పాదాలను దర్శనం చేసుకున్నారు.

గజమాల యాత్రను విజయవంతం చేయండి


మామిడికుదురులో కరపత్రాలు విడుదల చేస్తున్న సంఘం ప్రతినిధులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి మెడలో వేసే గజమాల యాత్ర ఈ నెల 6వ తేదీ శుక్రవారం జరుగుతుందని మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్ తెలిపారు. మామిడికుదురులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలబాలాజీ స్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా ఏటా జరిగే గజమాల యాత్ర తాటిపాకలోని తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం భవనం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. శెట్టిబలిజ వర్గీయులు, రామస్వామి అభిమానులు ఈ యాత్రలో పాల్గొని దీన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో బొక్కా వీరవెంకటేశ్వరరావు, నయినాల సత్యనారాయణ మూర్తి, రాయుడు నాగేశ్వరరావు, జోగి రామకృష్ణ, పెచ్చెట్టి సత్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బీచ్‌లు

- నిబంధనలు అతిక్రమించి స్నానాలు
- మారిన భౌగోళిక పరిస్థితులు
- ప్రమాదకరంగా తీరం
- మృత్యువాత పడుతున్న వైనం

తూర్పుపాలెం బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు


మలికిపురం: సముద్ర అలలను, గోదావరి తీరాలను చూస్తే సాహసాలు చేసే వారు చాలా మందే ఉంటారు. ఆ తీరంలోకి వెళ్లాక ఆ ఉత్సాహం చిన్నా పెద్దా అందరికీ అలాగే ఉంటుంది. సుమారు 50 ఏళ్ల క్రితం మాట అయితే తీరం నుంచి సముద్రం లోనికి కిలో మీటరుకు పైగా వెళ్లి సాహసంగా ఈత కొట్టి వచ్చేవారు. కానీ మారిన భౌగోళిక పరిస్థితులు, సునామీ, తుపాన్ల వల్ల అలల ధాటికి తీరం రూపు మారింది. దీంతో అలా సాహసం చేసే వారే లేరు. అయితే నేటి తరంలో అవగాహన లేని అనేక మంది సముద్రం, గోదావరిలో స్నానాలకు దిగి అనేక మంది మృత్యువాత పడుతున్నారు. సముద్ర తీరంలో నిఘా పూర్తిగా కొరవడింది. అటు రెవెన్యూ గాని ఇటు పోలీసు వ్యవస్థ గాని తీరంలో సరైన రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. రాజోలు దీవిలోని సముద్ర తీరం వెంబడి గ్రామాల్లో పర్యటించే విహార యాత్రికులు, విద్యార్థులను అదుపు చేయడం లేదు. బీచ్‌లో విహార యాత్రకు వచ్చే పర్యాటకులు, చిన్నారులు, విద్యార్థులు నిబంధనలు అతిక్రమించి సముద్రంలో స్నానాలకు దిగుతున్నారు. ఫలితంగా ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. సాధారణంగా పుణ్యస్నానాల సమయాల్లో రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలు ప్రాణనష్టం నేపథ్యంలో ఈ బీచ్‌లలో గట్టి భద్రత ఏర్పాటు చేసినా గత రెండేళ్లుగా ఈ భద్రత కొరవడింది. ప్రధానంగా విద్యార్థులు పాఠశాలలు ఎగ్గొట్టి బీచ్‌లకు చేరుకుని కెరటాల్లో స్నానాలకు దిగుతున్నారు. సెలవు దినాల్లో ఎలాగూ పాఠశాల ఉపాధ్యాయులకు బాధ్యత ఉండదు . కానీ పనిదినాల్లో కూడా విద్యార్థుల పట్ల నిఘా ఉంచడంలో ఉపాధ్యాయులు కూడా ఫెయిల్ అవుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఫలితంగా విద్యార్థులు స్కూల్‌కి ఎగనామం పెట్టి బీచ్‌లకు వచ్చేస్తున్నారు. వేసవి సెలవులకు సైతం దూర ప్రాంత విద్యార్థులు, పర్యాటకులు కూడా బీచ్‌లకు వస్తున్నారు. సరదాగా కెరటాల్లో స్నానాలకు ఎగబడుతున్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం, లైట్ హౌస్ వద్ద గల సాగర సంగమం వద్ద అడపాదడపా నిఘా ఉంటున్నా అక్కడ కూడా స్నానాలకు ఎగబడుతున్నారు. సాగర సంగమం చాలా ప్రమాదం. అంతర్వేది, కేశవదాసుపాలెం, చింతలమోరి, శంకరగుప్తం, పడమటిపాలెం , తూర్పుపాలెం, కేశనపల్లి, కరవాక తదితర బీచ్‌లలో అధికంగా స్నానాలకు ఎగబడుతున్నారు. ఇది గమనించిన రెవెన్యూ, పోలీసు అధికారులు గతంలో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అయితే రానురానూ గత రెండేళ్లుగా నిఘా కొరవడింది. గత పదేళ్లుగా స్నానాలకు దిగి మృతి చెందిన వారి సంఖ్య అధికంగానే ఉంది. తాటిపాక గ్రామానికి చెందిన సుమారు ఆరుగురు మహిళలతో సహా పలువురు పురుషులు అంతర్వేది సముద్రంలో స్నానాలకు దిగి మృతి చెందిన సంఘటన జరిగి సుమారు పదేళ్లు అవుతుంది. ఐదేళ్ల క్రితం చింతలమోరికి చెందిన ముగ్గురు విద్యార్థులు చింతలమోరి బీచ్‌లో స్నానానికి దిగి మృతి చెందారు. అలాగే తూర్పుపాలెం చింతలమోరికి చెందిన విద్యార్థులు ఇద్దరు రెండేళ్ల క్రితం ఇలానే మృత్యువాత పడ్డారు. విజయవాడ, భీమవరం నుంచి అనేక మంది విద్యార్థులు విహారయాత్ర సమయంలో స్నానాలకు దిగి అంతర్వేది బీచ్‌లో పలువురు విద్యార్థులు మృతి చెందిన సంఘటనలు ఇక్కడ అనేకం. బీచ్‌లో నిఘా ఉంచడంతో పాటు పాఠశాలలకు వచ్చే విద్యార్థులపై నిఘా ఉంచాలని, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు.

కట్టడి చేస్తాం



బీచ్‌ల వద్ద ప్రమాదాలను గుర్తించాం. పర్యాటకులను, విద్యార్థులు స్నానాలు చేయకుండా కట్టడి చేసేందుకు ఆయా పోలీస్ స్టేషన్లకు తగిన ఆదేశాలు ఇచ్చాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలి.

– టి.నగేష్‌కుమార్, సీఐ, రాజోలు

రేషన్‌కార్డు దరఖాస్తుకు ఇబ్బందులు

- మండల పరిషత్ సమావేశంలో ప్రశ్నల వర్షం
- వేధిస్తున్న లో–ఓల్టేజ్ సమస్య
- చర్యలు తీసుకోవాలని డిమాండ్


మామిడికుదురు మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని, విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్య తీవ్రంగా వేధిస్తోందని మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మామిడికుదురు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఆదుర్రులో లో–ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు వాపోయారు. దీనిని పరిష్కరించాలని కోరారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసేందుకు నిబంధనలు సడలించామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మొదటి నుంచి ఉన్న ఇబ్బందులే ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పాశర్లపూడి 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న వారికి వేరే చోట ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి కోరారు. అప్పటి వరకు వారిని అక్కడే ఉండనివ్వాలన్నారు. దీనిపై కలెక్టర్‌తో మాట్లాడానని వారికి ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. గ్రామాల్లో జాతరల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ చెప్పారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారు జాతరలు ముగిసిన వెంటనే వాటిని తొలగించాలన్నారు. బైపాస్ రోడ్డుపై రాత్రి సమయంలో మందుబాబుల ఆగడాలు మితి మీరిపోయాయని వారిని అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ విషయంలో కూడా ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలని ఎస్సై కోరారు. జాతీయ రహదారి బైపాస్ రోడ్డు కోసం బలవంతంగా భూమిని తీసుకుని దానిలో రోడ్డు నిర్మించి ఏడాది అయిందని ఎంపీటీసీ నయినాల సీతామహాలక్ష్మి చెప్పారు. కానీ ఇంత వరకు పరిహారం మాత్రం ఇవ్వలేదన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శరణ్య, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.